
# చింత చచ్చినా...

పాలగుమ్మి పద్మరాజు




అది నాలుగు మండువాల భవంతి. దాని వయస్సు రెండు వందల సంవత్సరాలు. రెండు పక్కల పెంకు కిందికి ఒరిగి పోయింది. ఒక్కొక్కగదే వాస యోగ్యం కాకుండా పోతుంటే, పంతులుగారూ భార్యా తమ ఆవాసాన్ని బాగున్న గదుల్లోకి మార్చుకుంటూ వస్తున్నారు. ఇప్పుడు తూర్పు భాగంలో రెండు మండువాలూ మారిపోయాయి. పశ్చిమార్థంలో పంతులుగారి నివాసం.

ఆ ఇంట్లో వస్తువులన్నీ సుమారు ఇంటివయస్సు గలవే. ఒక పంతులుగారూ, భార్యా తప్ప మండువాలన్నీ వర్షాకాలంలో జలమయమయిపోతాయి. నీరవతలికిపోయే తూములు పూడిపోవడం వల్ల. అంచేత ఆ ఇంట్లో కర్రసామానులు అసలు వయస్సుకంటే ముసలివిగా కనిపిస్తాయి.

పంతులుగారి తండ్రిది పెద్ద జమీ. తన చిన్నతనంలో ఆ ఇంటిశోభ చూసిన గుర్తుంది ఆయనకు. అంతే. వివరాలన్నీ గుర్తుంచుకోగల వయస్సు

ఆయన కొచ్చేసరికి, జమీ పోవడం తండ్రి మరణించడం, మిగిలిన ఒక్క మామిడితోటమీదా వచ్చే ఆదాయంతో తను బతకడమేకాక, అంతపెద్ద ఇంటి బాగోగులు చేయించడం వంటి మార్పులన్నీ అకస్మాత్తుగా వచ్చి పడ్డాయి. అంచేత చిన్ననాటి స్మృతులు—అంటే ఆ యిల్లు మూడు పువ్వులూ ఆరు కాయలుగా ఉన్న రోజుల స్మృతులు—ఎప్పుడో కలలో కనిపించిన దృశ్యాల్లాగ ఆయనకు జ్ఞాపకం ఉన్నాయి.

భార్య రోగిష్టి. ఆయనే వండి, తను తినవలసిన స్థితి. ఆయనకు కాలక్షేపమల్లా సోమసుందరంగారితో. వెనకటి కబుర్లు చెప్పుకుంటూ కూచోడు. సోమనాథం పంతులుగారికంటే పదేళ్ళు పెద్ద—అంచేత ఆ ఇంటి సిరిసంపదలు, పంతులుగారికంటె, స్పష్టంగా చూసివారాయన. ఆయనకు పంతులుగారంటే నిజమైన అనురాగం—ఆ ఇంట పుట్టినందుకు భక్తి కూడా.

పంతులుగారంటే ఆ ఊళ్లో అందరికీ భక్తే. స్థితిగతులు ఎలాంటివైనా ఆయన ఔదార్యం అందరూ గుర్తించిన వారే. నడివయస్సులో ఆయన ఆ ఊరికి మకుటం లేని రాజు. నూటికి తొంభై వంతులు తగాదాలన్నీ ఆయనముందు పరిష్కారమై పోయేవి.

పంతులుగారి మనసు ఎంత మంచిదో, పేరు అంత పెద్దది. అది ఆ ఊళ్ళో అందరికీ తెలిసిన విషయమే గనక ఎవరూ అట్టే పట్టించుకోరు. ఎవరన్నా కాని పనిచేస్తే వాళ్ళ ఇంటికి వెళ్ళి, ఏమయ్యా, నువ్విలాంటి పని ఎందుకు చేశావు అని కర్ర విరిచినట్లు అనేసేవాడు. ఆయన మీద భక్తివల్ల ఆ ఆసామీ ఏమీ అనలేక పోయేవాడు. అంచేత కాని పనులు చెయ్యడానికే జడిసేవారు ఆ ఊరి జనం.

అయితే క్రమంగా రోజులు మారాయి. ఆయనకు తెలీకుండానే ఆయన పలుకుబడి తగ్గిపోయింది. ఆ సంగతి చూచాయగా ఆయనకు తెలిసినా, అది గుర్తించడానికి ఆయన మనస్సు ఒప్పుకోలేదు. కారణం, యీ తరం కుర్రవాళ్లెవరూ ఆయన పుట్టు పూర్వోత్తరాలు ఎరగరు. పైగా పైనుంచి వచ్చిన కుటుంబాలు కొన్ని ఆ ఊరికి కొత్తగా వచ్చిన పంచదార ఫ్యాక్టరీకి సంబంధించినవి. అసలీ ఊరి సంగతిగాని, ఆ నాలుగు మండువాల భవంతి విషయంగాని ఎరగరు. అంచేత వాళ్ళకి ఆయనమీద గౌరవం ఉండడానికి అవకాశాలు తక్కువ. ఆయన క్రమంగా ఊరి వ్యవహారాల్లో జోక్యం కలిగించుకోడం మానేశాడు. అంచేత ఆయన మాట కాదనిపించుకునే పరిస్థితి రాలేదు. ఆయన తప్పించుకున్నాడనండి. కాని, ఆయనలో ఒకమూల యీ ఊరికింకా మకుటంలేని రాజుననే భ్రమ చచ్చిపోలేదు.

ఆయనకు పెద్ద సమస్య ఆయన

కొడుకు రంగయ్య. రంగయ్య ఇప్పు డెక్కడో ఉత్తరాదిని ఉద్యోగంలో ఉన్నాడు. రంగయ్య తన తాతగారి సంగతి విశదమేగాని చూపినవాడుకాడు. అతను పుట్టినప్పటినుంచీ దారిద్ర్యంతప్ప మరొకటి ఎరగడు. అంచేత తన తండ్రీ, సోమనాధంగారూ కలిసి వెనకటి కబుర్లు ఏకరువు పెడుతూంటే అవన్నీ పట్టి కట్టు కథలను కునేవాడతను. వీలై నప్పు డల్లా సోమనాధంగారిని వేళాకోళం చేస్తుండేవాడు. తండ్రిని ఏమనడానికీ సాహసం చాలక.

ఒకసారి రంగయ్య చిన్నతనంలో ఒక సంగతి జరిగింది. తోడిపిల్లలతో కలిసి అతను చెడుగుడు ఆడుతుండగా, ఒక సంపన్న గృహస్థు కొడుకు కూత కొస్తే, అతన్ని కిందపడేసి, గుండెల మీదెక్కి కూర్చున్నాడు ఆ సంపన్న గృహస్థు సరదాగా ఆట చూస్తున్నవాడు పట్టరాని కోపమొచ్చి, రంగయ్యని ఏడు తరాలు అటూ ఇటూ తిట్టరాని తిట్లు తిట్టాడు. రంగయ్య అన్నింటికి ఒక చిరునవ్వు సమాధానంగా పారేశాడు.

ఈ సంగతి పంతులుగారికి తెలిసింది. ఆయన ఇంట్లో ఉన్న పాత తుపాకీ తీశాడు. భార్య అడ్డుపడబోతే ఆమెను పక్కకీడ్చేసి గుమ్మంలో కొచ్చారు. అక్కడ కూర్చున్నాడు. ఇంతవరకూ ఆ తిట్టిన సంపన్న గృహస్థుమీద తుపాకీ పేలుస్తాడనుకున్న భార్య అతనక్కడ కూర్చోవడం చూసి బెదిరిపోయింది.

ఇంటికి రాని చవట పీనుగుని. పెద్దల్ని తిడుతుంటే ఏం చెయ్యకుండా ఇంటికి తిరిగొస్తాడా. ఒక్క గుండు దెబ్బతో యీ అగమానాన్ని తుడిచిపెట్టే స్తాను.....అని అరిచాడు, భార్య కెవ్వన కేకేసి మూర్ఛపోయింది. సోమనాధం గారూ, ఇరుగు పొరుగువాళ్ళూ వచ్చి వారించడానికి ప్రయత్నించారు. కాని లాభం లేకపోయింది

అయితే రంగయ్య మాత్రం ఇంటికి తిరిగిరాలే. ఈ సంగతి అతనికెలాగో తెలిసింది గాబోలు. చీకటిపడ్డ తరవాత పంతులుగారి కోపం ఆదుర్దాగా మారింది. ఇంకా రాలేడేం యీ పీనుగ....అన్నాడు సోమనాధంగారితో.

పోనీలెండి. రాకపోతేనేం, ఎక్కడో ఆత్మహత్య చేసుకుని ఉంటాడు. చెరువు లున్నాయి, రైలుంది....అన్నాడు కొంటెగా సోమనాధం.

చాల్లేవయ్యా, ఏమిటీ అపశకునం మాటలు ? అన్నాడు పంతులుగారు. ఏమీ లే—ఇంటికొస్తే మీరెలాగా కాల్చేస్తారు. అంచేత ఏ చావైతేనేం ?

ఆ తరవాత సోమనాధం, పంతులు గారూ కలిసి ఊరంతా గాలించారు. రంగయ్య జాడలేదు. ఆనాడు అంతర్ధాన మైన రంగయ్య అయిదు సంవత్సరాల

తరవాత మిలిటరీ దుస్తుల్లో ప్రత్యక్షమయాడు.

అప్పుడు సోమనాథంగారన్నారు.... ఆవేళ మీరు భయపెట్టింకొక మిషగాని. ఏదో పాడు చూసుకుని అట్నాయి వెళ్ళిపోయేవాడే.... అని.

రంగయ్య తన తండ్రి తన్ను చంపడానికి తీసిన తుపాకీ తెరిచి చూశాడు. పకపక విరగబడి నవ్వాడు. ఆ తుపాకి తుప్పుపట్టి పోయింది. లోపల గొట్టం అంతా పూడిపోయింది. అది పంతులుగారి తండ్రిగారు ఉపయోగించేవాడు వెనకటి రోజుల్లో. అయినా ఇది పాతకాలపు తుపాకి... అన్నాడు రంగయ్య.

ఏడిశావు. దీంతో మీ తాతగారు రెండు పెద్దపులుల్ని చంపారు.... అన్నాడు పంతులుగారు.

అయుండొచ్చు అయితే ఇప్పుడిది పిల్లిని కూడా చంపలేదు. మా పిస్టలు చూశారా. దానికంటె ఎంత చిన్నదో. ఇది పేల్చామంటే ఇంక తిరుగులేదు.... అన్నాడు రంగయ్య.

పంతులుగారు పాత తుపాకిని అప్యాయంగా నిమిరాడు. దాంట్లో తాత తండ్రుల ప్రభావం ఒక్కసారి ఆయన రక్తనాళాల్లోకి పాకినట్లు అనిపించింది. కాని అది చల్లని గడ్డకట్టుకుపోయిన ప్రభావం అది పేలదు. కొడుకు చేతితో చిన్న పిస్తోలు చేత్తో పట్టుకు చూశాడు. అది ప్రాణంలో బరువెక్కిపోయినట్టుంది. ఈ పాత కొత్తల మధ్య అంతరం అకస్మాత్తుగా ఆయనకు పెద్ద దెబ్బలాగ మనస్సులో తగిలింది. వెనకటి రోజుల ప్రభావం జీవచ్ఛవం లాంటిది బరువేగాని కదలిక లేనిది. ఈ కాలపు కొత్త శక్తి చిన్నదైనా చురుకు మెరుపుతునక. వింతగా, రెంటికీ ఆ ఆయుధాలు రెండూ చిన్నలుగా అనిపించాయి ఆ క్షణంలో పంతులుగారికి.

రంగయ్య తల్లిని బుజ్జగించాడు. తండ్రితో తన బాధని గురించి చర్చించాడు. ఈ పాత ఇంట్లో మిగిలిన గది ఒకటే. ఇంక కొద్ది రోజుల్లో కూలిపోతుంది. అంచేత తనతో అద్దానీ ఆగ్రా తీసుకుపోవడానికి నిశ్చయించానని చెప్పాడు. ఈ ఇల్లు ఏదో ఒకరికి అమ్మేసి వెళ్ళిపోదామన్నాడు. వద్దని చెప్పడానికి కూడా మనసు రాలేదు పంతులుగారికి

అర్థరాత్రి వేళ పిస్తోలు మోత రంగయ్యని లేపింది పరుగెత్తి వెళ్ళాడు పడమటి వరండాలో పంతులుగారి శరీరం రక్తపు మడుగులో పడి ఉంది. ఆయన చేతిలో తన పిస్తోలుంది.

చూస్తూ అలాగే నిలబడి పోయాడు రంగయ్య.

